క్లుప్తంగా

దాడులు చేయడం సరికాదు

షాద్‌నగర్‌రూరల్‌: రాజకీయంగా ఎదుర్కోలేక దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం మంచి పద్ధతి కాదని మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ కరుణాకర్‌ అన్నారు. హత్యాయత్నం ఘటనలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చిన కాంగ్రెస్‌ నాయకుడు చిల్కమర్రి రవీందర్‌రెడ్డిని మంగళవారం ఆయన స్వగృహంలో కురుణాకర్‌, కాంగ్రెస్‌ నేత బాదెపల్లి సిద్దార్థతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయంగా వైషమ్యాలు ఉంటే ఆ విధంగానే ఎదుర్కోవాలే తప్పా వ్యక్తిగతంగా దాడులు చేయడం, హత్యాయత్నానికి పాల్పడటం సరి కాదన్నారు. రాజకీయాల్లో ఇలాంటి ఘటనలకు తావులేదని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఉండొచ్చన్నారు.

బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ అందజేస్తున్న దాత చందు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: మండలంలోని గొల్లపల్లి, ధర్మసాగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం జీఎన్‌సీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో చైర్మన్‌ జి.చందు బ్యాగులు, స్టేషనరీని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాత చందును పాఠశాలల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కరాటే మాస్టర్‌కు ఎక్సలెన్స్‌ అవార్డు



అవార్డు అందుకుంటున్న మాస్టర్‌ అహ్మద్‌ఖాన్‌

షాద్‌నగర్‌: పట్టణానికి చెందిన కరాటే మాస్టర్‌ అహ్మద్‌ఖాన్‌ కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నందుగాను నేషనల్‌ స్టార్స్‌ ఎక్సలెన్స్‌ అవార్డు అందుకున్నారు. వైఎంకే అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో గుజ్జల సరళాదేవి ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాటేలో ప్రతిభను కనబర్చడంతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నందుకు న్యూపవర్‌ కుంగ్‌ఫూ అకాడమీ మాస్టర్‌ అహ్మద్‌ఖాన్‌కు ఎక్సలెన్స్‌ అవార్డు అందజేశారు. ఈ అవార్డు సినీనటుడు భానుచందర్‌ అహ్మద్‌ఖాన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాస్టర్‌ను అభినందించారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

షాబాద్‌: బీజేపీ షాబాద్‌ మండల నూతన కమిటీని మంగళవారం నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ తెలిపారు. మండల వైస్‌ ప్రెసిడెంట్లుగా బాలమణి, ఉపేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శేఖర్‌, ప్రధాన కార్యదర్శులుగా హరీష్‌, రాజీవ్‌రెడ్డి, కార్యదర్శులుగా మమత, శేఖర్‌, యాదీశ్‌, అనిత, ట్రెజరర్‌గా నారాయణ, సభ్యులుగా వెంకటేశ్‌గౌడ్‌, అశోక్‌, అనిల్‌, శేఖర్‌, అలివేలు, భాస్కర్‌రెడ్డి, శికృష్ణ, శ్రీశైలంను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని సూచించారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం చేయాలన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా మహేశ్‌

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన కంచుకోట మహేశ్‌ బీజేపీ మండల కన్వీనర్‌గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

అందుబాటులో పశుగ్రాస విత్తనాలు

మొయినాబాద్‌రూరల్‌: మండలంలోని పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశువైద్య అధికారి దేవిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా పాడిపశువుల రైతులకు కావాల్సిన పశుగ్రాస విత్తనాలు 75 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్‌ జిరాక్స్‌లను తీసుకొచ్చి.. ప్రాథమిక పశువైద్య కేంద్రంలో విత్తనాలు తీసుకోవచ్చని సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వానొస్తే.. రాస్తా బంద్‌

- బ్రిడ్జిలు లేక రోడ్లపై ప్రవహిస్తున్న నీరు
- రాకపోకలకు ఆటంకం
- పట్టించుకోని అధికారులు



నందిగామ నుంచి వీర్లపల్లి దారిలో బ్రిడ్జి లేకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్‌)

నందిగామ: భారీ వర్షం కురిసినా.. పెద్దఎత్తున వాగులు ప్రవహించినా.. ఇక ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే దూర మార్గాలను ఎంచుకోవాల్సిందే.. నందిగామ మండలంలోని పలు గ్రామాల రహదారుల దుస్థితి ఇది. ఆ రోడ్లలోని వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో పెద్దఎత్తున వాగు ప్రవహించిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో వానాకాలం వచ్చిందంటే చాలు.. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

బ్రిడ్జిలు లేక అవస్థలు

- మండల కేంద్రమైన నందిగామ నుంచి అంతిరెడ్డిగూడ మీదుగా నర్సప్పగూడ, చేగూరు గ్రామాలకు వెళ్లే దారిలో అంతిరెడ్డిగూడ-నర్సప్పగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగు పెద్దఎత్తున ప్రవహించినట్లయితే ఆ రోడ్డులో రాకపోకలు నిలిచిపోతాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు ఆ రోడ్డును మూసివేసి కాపలా ఉంటారు.
- మండల కేంద్రమైన నందిగామ నుంచి పిట్టిల్యామినేషన్‌ పరిశ్రమ పక్క నుంచి వీర్లపల్లికి వెళ్లే దారిలో వాగు వచ్చిందంటే చాలు ఆ రోడ్డులో ఉన్న వాగు ప్రవాహించి రాకపోకలు నిలిచిపోతాయి.
- చంద్రాయాన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే దారి(ఆర్‌అండ్‌ బీ)లో ఓ పౌల్ట్రీఫాం సమీపంలో ఉన్న వాగు సైతం ప్రవహించినట్లయితే ఆ మార్గంలో కూడా రాకపోకలు నిలిచిపోతాయి. ఈ మార్గంలో గతంలో సింబాయాసిస్‌ యూనివర్సిటీకి వెళ్లే విద్యార్థులు వాగు దాటే క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా వారు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు.

గత కొన్నేళ్లుగా..

భారీ వర్షం కురిసిన సమయంలో పెద్దఎత్తున వాగులు, వంకలు ప్రవహించడం సాధారణ విషయమే. అయినా ఆ మార్గంలో బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డబుల్‌ రోడ్డు సంగతి దేవుడెరుగు ఉన్న రోడ్లలో వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టేందుకు ఇంకా ఎంతకాలం వేచి చూడాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



పెద్దఎత్తున వాగు ప్రవహిస్తే మా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే చేగూరు రోడ్డు నుంచి తీగాపూర్‌ మీదుగా విజయలక్ష్మీ చౌరస్తా నుంచి నందిగామకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామానికి డబుల్‌ రోడ్డు నిర్మాణంతో పాటు వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలి.

–అశోక్‌కుమార్‌, మాజీ సర్పంచ్‌, నర్సప్పగూడ

ప్రతిపాదనలు పంపాం



మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిని రెండు వరుసలుగా నిర్మించేందుకుగాను పంచాయతీరాజ్‌ నుంచి ఆర్‌అండ్‌బీకి మార్చేందుకు ప్రతిపాదనలు పంపాం. ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. అదేవిధంగా నందిగామ నుంచి పిట్టిల్యామినేషన్‌ పరిశ్రమ పక్క నుంచి వీర్లపల్లికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు రూ. 5.6కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపాం.

–హేమంత్‌, పంచాయతీరాజ్‌ ఏఈ

అచ్యుతానందన్‌ ఆశయాలను కొనసాగిద్దాం



చేవెళ్ల: మండల కేంద్రంలో..



షాద్‌నగర్‌: నివాళులర్పిస్తున్న నాయకులు

సీపీఎం డివిజన్‌ కార్యదర్శి రాజు

షాద్‌నగర్‌: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌ ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం డివిజన్‌ కార్యదర్శి రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ డివిజన్‌ కార్యవర్గ సభ్యుడు శ్రీనునాయక్‌ అధ్యక్షతన మాజీ సీఎం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాజు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమంలో అచ్యుతానందన్‌ పాల్గొని కీలక పాత్ర పోషించారన్నారు. కేరళలో నిర్వహించిన వివిధ పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. పదేళ్ల వయసులో ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారని, వ్యవసాయ కార్మికులు భూస్వాముల దోపిడీకి గురైతే పోరాటం చేశారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్‌, బేరి శ్రీనివాస్‌, మహ్మద్‌ బాబు, కావలి రాజు, వడ్ల చంద్రమౌళి, వెంకటరమణ, ఆంజనేయులు, బలరాం, నర్సింలు, శ్రీకాంత్‌, ఆది, శివశంకర్‌, ఆరీఫ్‌, అయాన్‌, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి తీరని లోటు

చేవెళ్ల: కార్మికుల సమస్యలపై కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌ ఎన్నో ఉద్యమాలు చేశారని, ఆయన మృతి తీరని లోటని సీపీఎం చేవెళ్ల డివిజన్‌ కార్యదర్శి అల్లి దేవేందర్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాజీ సీఎం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం పెద్దపీట వేశారని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ చేవెళ్ల పట్టణ కార్యదర్శి నరేశ్‌, వివిధ సంఘాల నాయకులు కిష్టయ్య, శ్రీనివాస్‌, అరుణ్‌కుమార్‌, రాములు, దస్తగిరి, ఎట్టయ్య, భారతమ్మ, తదితరులు ఉన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మున్సిపల్‌ కమిషనర్‌ సునీత



పార్కులో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్‌ సునీత

షాద్‌నగర్‌: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పార్కులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని కమిషనర్‌ సునీత అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని న్యూసిటీ కాలనీలో ఉన్న పార్కును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కులు ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందిస్తాయన్నారు. పార్కుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వాటిల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి నిర్వహణ చేపడుతున్నట్లు వెల్లడించారు. మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

చేవెళ్ల: మండలంలోని ఇబ్రహీంపల్లి, అంతారం గ్రామాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పులు, డిల్లెంపల్లెం దరువులతో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లారు. అనంతరం గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

షాబాద్‌లో..

షాబాద్‌: మండల కేంద్రంలో మంగళవారం బోనాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి.



షాబాద్‌: బోనాల ఊరేగింపు



చేవెళ్ల: ఓ పాఠశాలలో..

కళాశాల నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

షాద్‌నగర్‌: దాతల సహకారంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్‌ కళాశాల భవనాన్ని మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మంత్రికి వివరించారు. పూర్వ విద్యార్థులతో పాటు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి కళాశాల నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

షాబాద్‌: ఫీల్డ్‌ అసిస్టెంట్లకు గత నాలుగు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఫీల్డ్‌ ఆ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ప్రతీ వారం మీటింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌, ఏపీఓ వీరాసింగ్‌, ఫీల్డ్‌ అసిసెంట్లు రాజు, అనంతయ్య, భూషన్‌ చారి, యాదయ్య, రాంచందర్‌ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు



హరీశ్‌రావుతో ముడిమ్యాల బీఆర్‌ఎస్‌ నాయకులు

చేవెళ్ల: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును మండలంలోని ముడిమ్యాలకు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నగరంలో ఆయన నివాసంలో ముడిమ్యాలకు చెందిన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిపాల్‌, చేవెళ్ల మార్కెట్‌ కమిటీ మాజీ డైరెక్టర్‌ గోనే కరుణాకర్‌రెడ్డి, నాయకులు శేరి రాజు, ఆరిఫ్‌, మాధవ్‌రెడ్డి, శివకుమార్‌, సాయికిరణ్‌రెడ్డి, సురేశ్‌, నందు, శ్రీకాంత్‌, రజిని, బేగరి, శ్రీకాంత్‌, కల్యాణ్‌ తదితరులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని సూచించినట్లు వారు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్‌

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌ పొందాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. చరిత్ర కలిగిన ఫరూఖ్‌నగర్‌ పాఠశాల ఎంతో మంది మేధావులను సమాజానికి అందించిందని గుర్తుచేశారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఎన్జీఓలు, తన సొంత నిధుల ద్వారా పాఠశాలను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

పట్టణంలోని 1వ వార్డులో రూ.1 కోటి 62 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ ప్రారంభించారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ ప్లాన్‌ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాల్లో కమిషనర్‌ సునీత, నాయకులు బాబర్‌ఖాన్‌, విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, కరుణాకర్‌, రఘు, ఇబ్రహీం, జమృద్‌ఖాన్‌, ముబాకర్‌, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌, పురుషోత్తంరెడ్డి, దంగు శ్రీను, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌, నాయకులు

‘చలో గన్‌పార్క్‌’కు తరలిన ఉద్యమకారులు



మొయినాబాద్‌: ప్రొఫెసర్‌ జయశంకర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

మొయినాబాద్‌: ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలనే డిమాండ్‌తో మంగళవారం చేపట్టిన చలో గన్‌పార్క్‌ కార్యక్రమానికి ఉద్యమకారులు తరలివెళ్లారు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి రమేశ్‌ ఆధ్వర్యంలో ప్రొఫెసర్‌ జయశంకర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చలో గన్‌పార్క్‌ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. ఉద్యమకారులకు ఇస్తామన్న గుర్తింపుకార్డులు, పింఛన్‌, 250 గజాల ఇంటి స్థలం వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు నర్సింలు, అవినాశ్‌, యాదయ్య, భిక్షపతి, మధు, రత్నం తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆ ఫోరం చేవెళ్ల పార్లమెంట్‌ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణానికి చెందిన ఉద్యమకారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. ఈ సందర్భంగా గన్‌పార్క్‌ వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించినట్లు తెలిపారు. ఉద్యమకారులను గుర్తించి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఉద్యమకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి స్వాగతిస్తున్న భీంభరత్‌

మొయినాబాద్‌: మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన బీజేపీ సీనియర్‌ నాయకులు కాంతిరెడ్డి, వడ్డె ఆంజనేయులు, కుండె నారాయణ మంగళవారం అజీజ్‌నగర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి భీంభరత్‌ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చూసి స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గణేశ్‌గౌడ్‌, నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దయానంద్‌, యాదయ్య, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య


శంకర్‌పల్లి: మున్సిపాలిటీ, మండలంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు. మంగళవారం శంకర్‌పల్లి మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో మున్సిపల్‌, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో, పట్టణంలో కొత్త రేషన్‌ కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అవకాశం ఉన్న ప్రతి చోట విరివిగా మొక్కలు నాటాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌ సురేందర్‌, మున్సిపల్‌ కమిషనర్‌ యోగేశ్‌, ఎంపీఓ గిరిరాజు, డిప్యూటీ తహసీల్దార్‌ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి పంపిణీ

మొయినాబాద్‌రూరల్‌: ప్రభుత్వం ద్వారా అర్హులైన వారందరికీ రేషన్‌ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి ప్రారంభిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో టెలికాన్ఫరెన్స్‌లో భాగంగా రేషన్‌ కార్డుల పంపిణీపై సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10వ తేదీవరకు మండల స్థాయిలో రేషన్‌ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు కొత్తగా కార్డులు వచ్చిన లబ్ధిదారులను పరిశీలించాలని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌



లబ్ధిదారులకు స్వీట్లు తినిపిస్తున్న నిరంజన్‌గౌడ్‌

మొయినాబాద్‌రూరల్‌: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బేస్‌మెంట్‌ లెవల్‌ బిల్లులు రావడంతో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌గౌడ్‌ పాల్గొని లబ్ధిదారులకు స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికే సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. ఇళ్లు నిర్మించుకునే వారందరూ త్వరగా పూర్తి చేసుకొని బిల్లులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.